క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయుల జాబితా విడుదల

బాపట్ల: ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణరావు బుధవారం విడుదల చేశారు. హెచ్ఎంలు బి.భద్రిరెడ్డి, పి.సాంబశివరావు, కె.పద్మావతి, స్కూలు అసిస్టెంట్‌లు ఇ.శ్యామ్యూల్, పి.పూర్ణచంద్రరావు, పి.జ్యోతినిర్మల, పి.వి.రామారావు, కె.రామయ్య, టి.పద్మావతి, ఎం.ధనలక్ష్మి, ఎస్.నరసింహారెడ్డి, పి.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, షేక్.జాన్‌బాషా, ఎ.ఉమామహేశ్వరరావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. వీరికి గురువారం స్థానిక పటేల్‌నగర్ శివారులోని అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో పురస్కారాల ప్రదానం జరుగుతుందని వివరించారు.

అవుతు సాంబిరెడ్డికి నివాళులు



వేమూరు(చుండూరు): వైఎస్సార్ సీపీకి అవుతు సాంబిరెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. చుండూరు మండలంలోని చిన పరిమి గ్రామానికి చెందిన అవుతు సాంబిరెడ్డి ఇటీవల మరణించారు. బుధవారం ఆయన చిత్రపటానికి వరికూటి అశోక్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చందోలు డేవిడ్ విజయకుమార్, కొండ శివ ప్రసాద్ రెడ్డి, ఎంపీపీ జాలాది రూబేను, మోదుకూరి హరిబాబు, బొల్లిముంత ఏడుకొండలు అవుతు చైతన్య రెడ్డి, సిరాజుద్దిన్, జల్లి జోషి కాంత్, కర్రెం శెట్టి బాలు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించాలి

రేపల్లె రూరల్: వర్షాలు, వరదలకు దెబ్బతిన్న పంటల వివరాలు త్వరగా సేకరించాలని కలెక్టర్ జె.వెంకట మురళి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. పంట నష్టపరిహార వివరాల సేకరణపై పట్టణంలోని పత్తిపాటి సీతారామయోగిని కల్యాణ మండపంలో రేపల్లె డివిజన్ విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్(వీఏఏ)లతో బుధవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. నష్టపరిహార వివరాల సేకరణలో ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా పారదర్శకంగా పనిచేయాలన్నారు. గ్రామస్థాయిలో, మండల స్థాయిలో కమిటీలుగా ఏర్పడి పంట నష్టం పరిహార జాబితాను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంచాలకులు వై.రామకృష్ణ, వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.విజయ్‌బాబు, వివిధ మండలాల ఏవోలు, ఏఈవోలు, ఎంపీఈవోలు, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

బాపట్ల: గణేశ్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరని ఎస్పీ తుషార్ డూడీ పేర్కొన్నారు. వినాయకుని పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసుకునేవారు అనుమతులు తీసుకోవాలని చెప్పారు. 7995095800 మొబైల్ నంబరుకు వాట్సాప్ ద్వారా సందేశం పంపితే వైబ్‌సైట్ లింకు ద్వారా అనుమతులు తీసుకోవచ్చని తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదు వేగవంతం

బాపట్ల: బీజేపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేస్తామని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్ పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగింది. కేంద్రంలో నరేంద్ర మోదీ చేపట్టిన కార్యక్రమాలతో ప్రపంచ దేశాలు సైతం మనవైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా పార్టీ అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, బీజేపీ యువమోర్చ అధ్యక్షులు కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆపన్నహస్తం



కర్లపాలెం: వరద బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. భారీ వర్షాలకు రేపల్లె పరిసర లంక గ్రామాలకు వరద రావటంతో బాధితులకు సహాయం అందించేందుకు కర్లపాలెం ఆర్యవైశ్య సంఘం, వాసవీక్లబ్ ఆధ్వర్యంలో యాపిల్స్, బిస్కెట్లు, వాటర్ బాటిళ్లను ఆర్యవైశ్య యువకులు బుధవారం తీసుకు వెళ్లారు. లంక గ్రామాలకు వెళ్ళిన వారిలో బి.రాంబాబు, పి.సురేష్ బాబు, ఎం.గిరి, టి.సుబ్బారావు, ఎం.రమేష్, జి.శ్రీను, టి.సత్యనారాయణ, కె.చంద్రం, పి.నాగరాజు, ఎం.రామకృష్ణ, కె.కిషోర్ తదితరులు ఉన్నారు.

సీఐటీయూ బాసట



భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెంలో బుధవారం సీఐటీయూ బృందం పర్యటించింది. బాధిత కుటుంబాలకు అరటి పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు కె.ఉమామహేశ్వరరావు, కె.ధనలక్ష్మి, జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, ఆశా కార్యకర్తల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రేఖా ఎలిజిబెత్, ఝాన్సీ, సీఐటీయూ నాయకులు కె.శరత్, జి.సుధాకర్, బి.రమాదేవి, ఎస్ఎఫ్ఐ నాయకులు పి.మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను నిలదీసిన బాధితులు



చింతమోటు గ్రామంలో ఎమ్మెల్యే ఆనందబాబును నిలదీశాన వరద బాధితులు.

వేమూరు: ప్రభుత్వం సహాయక చర్యలు అందించాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబును బాధితులు నిలదీశారు. భట్టిప్రోలు మండలంలోని వరద ప్రభావిత లంకల్లో బుధవారం ఆయన పర్యటించారు. సహాయక చర్యలపై బాధితులు ఆయనను నిలదీశారు. దీంతో ప్రభుత్వం అందరినీ ఆదుకుంటుందని ఎమ్మెల్యే సముదాయించారు.

కష్టాల వెల్లువ

- వరద వీడినా తప్పని తిప్పలు
- ఇళ్లల్లో మేట వేసిన ఒండ్రు మట్టి
- లంక గ్రామాల్లో తీవ్ర దుర్గంధం

భట్టిప్రోలు: కృష్ణమ్మ శాంతించింది. వరద ముంపు క్రమంగా వీడుతోంది. అయినా లంక గ్రామాల్లో కష్టాలు వెల్లువెత్తుతున్నాయి. ఒండ్రు మట్టి, బురద మేటలు వేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఒండ్రు మేట వేసిన గృహాలను శుభ్రపరుచుకునేందుకు మహిళలు అష్టకష్టాలు పడుతున్నారు. భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు జెడ్పీ, భట్టిప్రోలు విశ్వశాంతి, ఓలేరు పరిధిలోని తూర్పుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఇప్పుడిప్పుడే వరద నుంచి గృహాలు బయట పడటంతో తమ ఇళ్లను చూసుకునేందుకు బాధితులు తరలి వెళుతున్నారు. కరకట్ట దిగువన ఇంకా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో పునరావాస కేంద్రాల నుంచి బాధితులు పడవలు, ట్రాక్టర్లలో సొంత గ్రామాలకు వెళ్తున్నారు. వరద తగ్గుముఖం పట్టడంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను ఆ శాఖ చేపట్టింది.

దెబ్బతిన్న సామగ్రి

లంకల్లోని ఇళ్లలో సామగ్రి దెబ్బతిన్నాయి. గృహోపకరణాలు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. కొన్ని చోట్ల ఇళ్లు దెబ్బతిన్నాయి. దీంతో బాధితులు విలపిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను అధికారులు చేపట్టారు. గ్రామాల్లో పరిస్థితులను తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు పర్యవేక్షిస్తున్నారు. భట్టిప్రోలు మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక గ్రామాలలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పర్యటించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.

సీఎం వస్తున్నారని హడావుడిగా ఏర్పాట్లు

కృష్ణానది పరీవాహక లంక గ్రామాల్లో వరద ముంపు ప్రాంతాల్ని చూసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం వస్తున్నారన్న సమాచారంతో అధికారులు హడావుడి చేశారు. బాపట్ల జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెల్లవారుజామున 2:30 గంటలకే భట్టిప్రోలు చేరుకున్నారు. ఆయన వెంట బాపట్ల, రేపల్లె ఆర్డీవోలు జి.రవీందర్, హేలాషారోన్ ఉన్నారు. స్థానిక విశ్వశాంతి హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. కొన్ని వస్తువులు లేకపోవడంతో బాపట్ల, తదితర ప్రాంతాల నుంచి భట్టిప్రోలుకు తరలించారు. పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, విద్య, వివిధ శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. వేమవరం వద్ద హైవేపై ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ నుంచి భట్టిప్రోలు, కొల్లూరు మండలాలకు వెళ్లే మార్గంలో అడుగడుక్కి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బాంబ్ స్క్వాడ్ కూడా వచ్చింది. వారికి స్థానిక పీహెచ్‌సీ వైద్యుడి గదిని ఖాళీ చేసి అప్పగించారు. పోలీసులకు మార్కెట్ యార్డ్‌లో వసతి ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల సమయంలో సీఎం పర్యటన రద్దు అయినట్లు సమాచారం రావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అక్కడి నుంచి తమ ప్రాంతాలకు తరలే పనిలో నిమగ్నమయ్యారు.



భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెం ఓ ఇంటిని తన్నిపెట్టి కొనసాగుతున్న వరద నీరు



అరవింద వారధిపైకి కొట్టుకొచ్చిన బురద, వ్యర్థాలు, దూడ కళేబరం

దుప్పట్లు పంపిణీ



వేమూరు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొల్లూరు మండలం దోనేపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లోని బాధితులకు బుధవారం దుప్పట్లు, పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, జన సేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉసా రాజేష్, మాజీ ఎంపీపీ కనగాల మధుసూదనరావు పాల్గొన్నారు.



ఓలేరు పల్లెపాలెంలో బురదమయమైన ఇల్లు, దెబ్బతిన్న సామగ్రి

పశువులు, జీవాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

కలెక్టర్ వెంకట మురళి



వేమూరు: పశువులు, జీవాలకు నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రైతులకు పశువుల దాణా, ఔషధాలను బుధవారం ఆయన ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తు టీకాలు వేయాలని అధికారుల్ని ఆదేశించారు. వరద విపత్తుతో నీట మునిగిన లంక గ్రామాల పశువులకు వెంటనే దాణా అందజేయాలని చెప్పారు. దీని నిమిత్తం రూ.15 లక్షల విలువైన 95 టన్నుల సంపూర్ణ మిశ్రమ దాణా, రెండు లక్షల విలువైన ఔషధాలను లంక గ్రామాలకు పంపించినట్లు తెలిపారు. మొబైల్ పశు వైద్యశాల కూడా అందుబాటులో ఉంటుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.



పునరావాస కేంద్రాల నుంచి పడవలలో ఇంటికి చేరుతున్న పెనుమూడి పల్లెపాలెం గ్రామస్తులు



భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెంలో వరద ముంపు నుంచి బయట పడిన గృహాలు

ఊరంతా విద్యా సుగంధం

- గరువుపాలెం కాదు గురువులపాలెం
- ఆ కుగ్రామంలో ప్రతి ఇంటా ఓ ఉపాధ్యాయుడు
- తొలి ఉపాధ్యాయునిగా పద్మనాభుడు
- చుట్టుపక్కల గ్రామాల యువతకు ఆదర్శంగా గ్రామం





గరువుపాలెం ప్రాథమిక పాఠశాల

రేపల్లె రూరల్: మాస్టారు నమస్కారం! అంటూ ఆ గ్రామంలో నిత్యం వినిపించే గౌరవ పలకరింపు. ఆ పిలుపు ఆ కుగ్రామాన్ని గురువులపాలెంగా సంబోధించుకునే స్థాయికి చేర్చింది. బాపట్ల జిల్లా రేపల్లె తీరప్రాంతమైన నిజాంపట్నం మండలం గరువుపాలెం పంచాయతీ పరిధిలోని గరువుపాలెం గ్రామంలో సుమారు 150 ఇళ్లు ఉంటాయి. ఇప్పటి వరకు 120 మందికిపైగా ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తున్నారు. బతకలేక బడి పంతులు అన్న రోజుల నుంచి, ప్రస్తుతం బతికితేనే బడి పంతులు అన్న నానుడితో ఉపాధ్యాయ వృత్తి పదిలం అంటూ పలువురు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. ఒక్కొక్క కుటుంబంలో తండ్రి ఆ తరువాత కొడుకులు, మనుమలు ఉపాధ్యాయులుగా కొనసాగుతూ వృత్తికే వన్నె తెస్తున్నారు. గ్రామంలో ఇంటికి ఒకరికైనా ఉపాధ్యాయుడిగా అవ్వాలని తలంపు ఉంటుంది. ఇక్కడ పుట్టిన ఆడబిడ్డలు, గ్రామానికి కోడళ్లుగా వచ్చిన వారు ఇదే వృత్తిలో ఉంటున్నారు. ఉపాధ్యాయులు అనగానే ఈ జిల్లాలో లక్కున గరువుపాలెం మదిలో మెదులుతుంది.

ఇతర వృత్తుల్లోనూ రాణింపు

ఉపాధ్యాయ వృత్తితో పాటు పోలీసు, రక్షణ శాఖలో 100 మంది దాకా, ఇంజినీరింగ్, పలు విభాగాల్లో పలువురు పని చేస్తున్నారు. ప్రతి ఇంటిలో ఉపాధ్యాయులతో పాటు ఏదో ఒకటి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో ఉన్నారు. దీనికి ఆ గ్రామంలో ఉపాధ్యాయ వృత్తికి వేసిన బాటలే కారణమని చెప్పాలి. ఈ గ్రామం చుట్టుపక్కల గ్రామాలకు ఆదర్శంగా మారి యువతను ప్రభావితం చేస్తోంది.

పెరిగిన అక్షరాస్యత

ఉపాధ్యాయ వృత్తిలో ఎక్కువ మంది కొనసాగుతుండటంతో ఆ గ్రామంలో అక్షరాస్యత పెరుగుతూ వచ్చింది. యువతలోనూ ఉపాధ్యాయ ఉద్యోగమో లేదా ప్రభుత్వ ఉద్యోగమో సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగే తత్వం పెరిగింది. ప్రభుత్వ ఉద్యోగం రాని పక్షంలో ప్రైవేటు ఉద్యోగం అయినా చేస్తూ ముందుకు సాగుతున్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయులు స్ఫూర్తి

గ్రామంలోని ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న వారు, ఉద్యోగ విరమణ చేసిన వారు తమ వంతు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం చదువుకుంటూ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న వారిని ప్రేరేపిస్తున్నారు. ఉద్యోగాలు సాధించే విధంగా తర్ఫీదునిస్తూ నవతరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

తొలి ఉపాధ్యాయుడు బండారు పద్మనాభుడు



బండారు పద్మనాభుడు ఉపాధ్యాయ వృత్తి వైపు వేసిన తొలి అడుగులు అనేక మందికి ఆదర్శప్రాయమయ్యాయి. వ్యవసాయం ప్రధాన వృత్తిగా కొనసాగుతూ అక్షరాస్యత నామమాత్రంగా ఉన్న రోజుల్లో ఆయన కష్టపడి చదువుకున్నారు. 1930 ప్రాంతంలో గరువుపాలెం నుంచి ఉపాధ్యాయ వృతిలోకి అడుగుపెట్టారు. ఆ వృత్తికే వన్నె తెచ్చారు. గ్రామస్తుల్లో ఉపాధ్యాయ వృత్తిపై మక్కువ పెంచారు. ఆయన స్ఫూర్తితో పలువురు వృత్తిలోకి అడుగుపెట్టారు. తీర ప్రాంతంలోని ఓ కుగ్రామాన్ని గురువులపాలెంగా ప్రజల్లోకి తీసువెళ్లిన పద్మనాభుడు 1984 ఏప్రిల్ 22న మృతి చెందారు.